సాక్షి జగిత్యాల

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



నృసింహస్వామి ఆలయ సంప్రోక్షణ

ధర్మపురి: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మూసివేసిన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయం, అనుబంధ దేవాలయాల్లో ఆదివారం ఉదయం సంప్రోక్షణ, గ్రహణ పూజలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి భక్తుల దర్శనాలకు అనుమతించారు.



న్యూస్‌రీల్

ధర్మపురిలో భరణి నక్షత్ర వేడుకలు



ధర్మపురిలో యమధర్మ రాజుకు ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయమైన యమధర్మ రాజు ఆలయంలో ఆదివారం భరణి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగనంలో ఆయుష్య హోమం, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, దేవస్థానం సిబ్బంది, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్, సభ్యులు తదితరులున్నారు.

సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు



సీ విజిల్ యాప్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: పౌరులు తమ దృష్టికి వచ్చే కోడ్ ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీ విజిల్ యాప్ సెంటర్‌ను ఆదివారం పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించినా.. పంపిణీ చేసినా వీడియో, ఫొటోలు తీసి సీ విజిల్ యాప్ ద్వారా పంపాలని, అధికారులు నిమిషాల్లోనే చేరుకుని చర్యలు తీసుకుంటారని తెలిపారు. సీ విజిల్ ఫిర్యాదులపై 24గంటల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లా పరిధిలోని మూడు నియోజవర్గాల నుంచి 109 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ లత తదితరులు ఉన్నారు.

రెండు రోజులు శిక్షణ

పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై ఈ నెల 30, 31 తేదీల్లో మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్మపురిలోని ఎస్టీ బాలుర వసతి గృహం, కోరుట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగుతులు ఉంటాయన్నారు.

సేవా దృక్పథంతోనే కంటి ఆపరేషన్లు



కంటి పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: సేవా దృక్పథంతోనే కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పావని కంటి ఆస్పత్రిలో 22 మంది మహిళలకు కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. పేదలకు ఉచితంగానే కంటి శస్త్రచికిత్సలు చేస్తున్నామని, అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

జగదీశ్వర్ శర్మకు స్వర్ణ కంకణం



పురస్కారం అందుకుంటున్న జగదీశ్వర్ శర్మ

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రానికి చెందిన టీవీ గాయకుడు, నేషనల్ అవార్డు గ్రహీత డాక్టర్ గుంటి జగదీశ్వర్ శర్మకు హైదరాబాద్‌లోని ఆర్‌కే కళాసాంస్కృతిక ఫౌండేషన్ వారు ఎన్టీఆర్ ఆడిటోరియంలో స్వర్ణ కంకణం అవార్డు అందించారు. జగదీశ్వర్ శర్మ మాట్లాడుతూ 25 ఏళ్లుగా గాయకుడిగా కొనసాగుతున్న తనకు ఇప్పటివరకు తనకు 114 అవార్డులు వచ్చాయన్నారు.



పోరాడి రాజులు అవుతారో.. అమ్ముకొని బానిసలు అవుతారో.. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.
– బీఆర్ అంబేద్కర్

మీకు తెలుసా?

22 ఏళ్లు.. మూడు గుర్తులు

కరీంనగర్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పురుడు పోసుకొని సరిగ్గా 22 ఏళ్లయింది. 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్ఎస్‌గా ఆవిర్భవించి ప్రస్తుతం బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందింది. 22 ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీ మూడు గుర్తులతో ఎన్నికల బరిలోకి దిగింది. పార్టీ ఆవిర్భావం జరిగాక సిద్దిపేట ఎమ్మెల్యే పదవి, డిప్యూటీ స్పీకర్ పదవికి సీఎం కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బస్సు గుర్తును కేటాయించారు. వెనువెంటనే వచ్చిన స్థానిక సంస్థల (2001)ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి రైతు నాగలి గుర్తును కేటాయించారు. అనంతరం 2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కారు గుర్తు కేటాయించడంతో ఆ గుర్తు బీఆర్ఎస్‌కు సొంతమైంది.

మనోళ్లు సీనియర్లే!



- అసెంబ్లీలో సీనియర్లంతా ఉమ్మడి జిల్లావారే..!
- నాలుగు నుంచి ఏడుసార్లు శాసనసభకు ఎన్నిక
- ఉద్యమాల గడ్డ కావడమే ప్రధాన కారణం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్కూల్.. కాలేజీ.. పనిచేసే చోట.. అంతెందుకు కుటుంబంలోనూ చిన్నా, పెద్ద, సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసాలు సర్వసాధారణం. ఇందుకు అసెంబ్లీ కూడా మినహాయింపు ఏమీ కాదు. ఇపుడున్న సభలో ఉమ్మడి రాష్ట్రం నుంచి వరుసగా ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా.. విజయం సాధిస్తున్న ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు. వీరిని సీనియర్ శాసనసభ్యులు అంటూ స్పీకర్, తోటి ఎమ్మెల్యేలు సంబోధించడం పరిపాటి. అది ఆయా నియోజకవర్గాల్లో ఆ ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాబలం, సభలో వారికి ఉన్న అనుభవానికి తోటి సభ్యులు ఇచ్చే మర్యాద, గౌరవాలకు సూచన. అలాంటి సీనియర్ ఎమ్మెల్యేల్లో అధికశాతం మంది కరీంనగర్ జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం సభలో ఉన్న సభ్యులను మిగిలిన జిల్లాల సభ్యులతో పోల్చినపుడు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలే సీనియర్లుగా నిలుస్తున్నారు. వీరిలో మెజారిటీ గులాబీ పార్టీకే చెందిన వారు కావడం విశేషం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో పురుడుపోసుకున్న పార్టీ నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి)కి మొదటి నుంచి కరీంనగర్ జిల్లాలో పట్టు ఎక్కువ. అందుకే రాష్ట్ర సాధనలో భాగంగా పలుమార్లు రాజీనామాలు చేయడం.. తిరిగి ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో వీరు తమతోపాటు సభకు ఎంపికైన తోటి ఎమ్మెల్యేల కంటే అత్యధిక సార్లు విజయం సాధించిన నేతలుగా అరుదైన గుర్తింపు సాధించారు. ప్రస్తుతం జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ శాసన సభకు మూడోవి. అదే సమయంలో సభలో కనిష్టంగా రెండు నుంచి గరిష్టంగా ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినవారు సభలో ఉండటం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో వారు సాధించిన వరుస విజయాలే వారి సీనియారిటీకి కారణం.

7 సార్లు



ఈటల రాజేందర్ టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 ఎన్నికల్లో మొత్తం ఏడుసార్లు విజయం సాధించారు. ఇందులో 2008, 2010, 2021 ఉప ఎన్నికలు ఉన్నాయి. 2021లో ఆయన బీజేపీలో చేరి విజయం సాధించడం గమనార్హం.

6 సార్లు



ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983, 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నారు.

6 సార్లు



మంత్రి కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి మొత్తం ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

4 సార్లు



సిరిసిల్ల నుంచి కేటీఆర్, వేములవాడ నుంచి చెన్నమనేని రమేశ్ బాబు, కోరుట్ల నుంచి కె.విద్యాసాగర్‌రావు 2009, 2010, 2014, 2018లో వరుసగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇందులో 2010లో ఉప ఎన్నిక కావడం విశేషం. ప్రస్తుతం రమేశ్‌బాబు, విద్యాసాగర్‌రావు ఈ సారి పోటీలో లేరు.

4 సార్లు



మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 1999, 2004, 2009లో కాంగ్రెస్ నుంచి వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. 2014లో ఓడినప్పటికీ 2018లో తిరిగి శాసనసభకు నాలుగోసారి ఎన్నికయ్యారు.

3 సార్లు



గంగుల కమలాకర్ 2009, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ విజయాలతో కరీంనగర్‌లో తన పేరిట కొత్త రికార్డు లిఖించుకుని, నాలుగోసారి విజయంపై కన్నేశారు.

దివంగత మాజీ ఎమ్మెల్యేల రికార్డు

4 సార్లు




కమలాపూర్ ఎమ్మెల్యేగా దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 1985, 1989, 1994, 1999లో నాలుగు సార్లు విజయం సాధించారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

6 సార్లు



దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1957లో చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 1967, 1978, 1985, 1994, 2004లో ఆరుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు.

4 సార్లు



దివంగత దేశిని చిన్నమల్లయ్య 1978, 1984, 1989, 1994లో ఇందుర్తి (ప్రస్తుతం హుస్నాబాద్) నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తా

- పసుపుబోర్డు తెచ్చి హామీని నిలబెట్టుకున్న..
- బీజేపీ కోరుట్ల అభ్యర్థి ధర్మపురి అర్వింద్



సిరిపూర్‌లో మాట్లాడుతున్న అర్వింద్

మల్లాపూర్: కోరుట్ల నియోజకవర్గంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తానని నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని సిరిపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మండల బూత్‌స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. పసుపుబోర్డు తెస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చానని, అది సాధించినట్లే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తానని వెల్లడించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించి మూసివేయించిన పాపం టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలదన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పేరిట కేసీఆర్ కుటుంబం అందినకాడికి దోచుకుంటోందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో 10 కిలోల తరుగు తీస్తూ బీఆర్ఎస్ నాయకులు కోట్లు దండుకుంటున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు దళితబంధు ఇవ్వాలంటే రూ.3లక్షలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలంటే రూ.2లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. కోరుట్ల సహా పార్లమెంట్ పరిధిలో అన్ని స్థానాల్లో బీజేపీని రైతులే గెలుపించుకోవాలని కోరారు. అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సురభి నవీన్ కుమార్, జేఎన్.వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పనికీ కమీషన్..

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పనిలోనూ కల్వకుంట్ల కుటుంబానికి కమీషన్లు అందుతున్నాయని అర్వింద్ ఆరోపించారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో పార్టీ బూత్‌స్థాయి అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, నాసిరకం పనులతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని పేర్కొన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు.

బాలుడిని కలిసిన అర్వింద్

మోహన్‌రావుపేటకు చెందిన బాలుడు హర్షతేజాకు ఏడాది క్రితం ధర్మపురి ఫౌండేషన్ తరపున ఎంపీ గుండె శస్త్ర చికిత్స చేయించారు. బాలుడి ఆరోగ్యంపై ఆరా తీసిన అర్వింద్ హర్షతేజా ఇంటికి వెళ్లారు. బాలుడిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. హర్షచేయిని ముద్దాడారు.

బీజేపీలో పలువురి చేరిక

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలన్నారు.

కేంద్రాలు దూరం.. తప్పని భారం..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి అనుబంధమైన చంద్రయ్యపల్లి. ఇక్కడ పోలింగ్‌కేంద్రం లేదు. చంద్రయ్యపల్లివాసులు దశాబ్దాలుగా బుగ్గారానికి వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. బుగ్గారం ఇక్కడి నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్లు దూరం ఉంటుంది. వృద్ధులు, మహిళలు, యువకులు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలు, నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది.

- ఓటేయాలంటే తప్పని ప్రయాస
- కొన్ని కేంద్రాలు నాలుగు కిలోమీటర్లపైనే..
- ఓటింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం

జగిత్యాల: పోలింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో జిల్లా అధికారులు పట్టణాలు, గ్రామాల్లో ఈవీఎం, వీవీపాట్‌లపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. నియోజకవర్గానికి వెళ్లి ప్రతి గ్రామగ్రామాన ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. యువత, మహిళల కోసం ప్రత్యేకంగా బూత్‌లను ఏర్పాటు చేయడంతోపాటు, వారికి ఓటరు నమోదుకు నవంబర్ ఒకటో తేదీ వరకూ అవకాశం కల్పించారు. అయితే.. జిల్లాలో దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల విషయాన్ని మాత్రం మర్చిపోయినట్టున్నారు. కొన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు చాలా దూరంగా ఉన్నాయి. అంతదూరం వెళ్లాలంటేనే ఓటర్లు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకంగా రెండు మూడు కిలోమీటర్ల వరకు దూరంలో పోలింగ్ కేంద్రాలున్నాయి. సొంత వాహనాలు ఉన్నవారు వెళ్లి ఓటేస్తుండగా.. నడిచి వెళ్లేవారు మాత్రం ఓటింగ్‌కు దూరమవుతున్నారు. ఇది పోలింగ్ శాతంపై ప్రభావం చూపే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పోలింగ్‌కేంద్రాల్లో విద్యుద్దీకరణ పనులు, సాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాల్సి ఉంది. జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామని పేర్కొంటున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో వసతులు లేక ఇబ్బందికరంగా మారింది. శాసనసభ ఎన్నికలు మరో నెల రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ కొన్ని చోట్ల మాత్రం ఇబ్బందికరమైన పరిస్థితులున్నట్లు తెలుస్తోంది.

ఓటింగ్ శాతం పెరిగేనా..?

జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు లేకపోవడం, సుదూరంగా ఉండటంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి. అధికారులు మాత్రం మొదటి నుంచి ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. నెలరోజులే సమయం ఉండడంతో ఇవి పూర్తయ్యే అవకాశాలు కన్పించడం లేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు నిత్యం పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తూ మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా సమస్యాత్మక కేంద్రాలు సైతం ఇబ్బందికరంగా ఉన్నాయి. దాదాపు జిల్లాలో 248 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని నాయకపుగూడెం. ఇక్కడ సుమారు 250 వరకు ఓటర్లు ఉంటారు. వీరు పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. అంతదూరం వెళ్లి ఓటు వేయాలంటే అక్కడి గిరిజనులు ఇబ్బందికి గురవుతున్నారు. ఇలా పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉన్న గ్రామాలు సుమారు పది నుంచి 15 వరకు ఉంటాయని తెలుస్తోంది.

పోలింగ్ కేంద్రాలు	
కోరుట్ల	262
జగిత్యాల	254
ధర్మపురి	269

తరుగు.. ప్రచార అస్త్రం



ధాన్యం కొనుగోళ్లు

- కొద్ది రోజుల్లోనే కేంద్రాలకు ధాన్యం
- రైతు వర్గాల్లో పట్టుకు విపక్షాల యత్నం
- తిప్పికొట్టేందుకు అధికార పార్టీ సిద్ధం

కోరుట్ల: అసలే ఎన్నికల సమయం.. జిల్లాలో రైతు వర్గాలు కీలకం. ఈ సమయంలో మరో 15 రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరనుంది. ఇక్కడే సమస్య మొదలు కానుంది. నాలుగేళ్లుగా ధాన్యం సేకరణ సమయంలో ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో తూకం తరువాత తరుగు సమస్య వెంటాడింది. ఈసారి ఆ పరిస్థితిని ఆసరా చేసుకుని విపక్షాలు తరుగు పేరిట రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఎత్తి చూపేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. దానిని ఎదుర్కొనేందుకు అధికార పక్షం సన్నాహాలు చేస్తోంది.

ఏటా తప్పని తరుగు..

జిల్లాలో ప్రతి సీజన్‌లో తరుగు పేరిట ఇటు కొనుగోలు కేంద్రాల్లో.. అటు రైస్‌మిల్లుల్లో కోత విధిస్తున్నారు. ఈ వానాకాలం జిల్లాలో 3.05లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 6 నుంచి 8 లక్షల క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఐదేళ్లుగా కొనుగోలు సమయంలో తేమ, తాలు, తప్ప పేరిట తూకం వేసిన తరువాత రైస్‌మిల్లర్లు తరుగు తీయడంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఒక్కో చోట క్వింటాలుకు 3 నుంచి 5 కిలోల వరకు రైస్ మిల్లర్లు కోత విధిస్తుండటంతో గత సీజన్‌లో రైతులు తీవ్ర ఆందోళనకు దిగాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ అధికార యంత్రాంగం తరుగు తీయొద్దని కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లకు నిక్కచ్చిగా సూచనలు జారీచేసినా ఫలితం దక్కలేదు.

ఎన్నికల వేళ..తరుగు రచ్చ

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు అన్ని పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. ప్రచారంపర్వం ఊపందుకుంది. ఇటీవల బీజేపీ కోరుట్ల అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ఓ సభలో మాట్లాడుతూ.. తరుగు పేరిట రైతుల దోపిడీ సాగుతున్నా అధికార పార్టీ పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఏడాది కోతలు ఉంటే ప్రచారంగా వాడుకుని రైతుల నుంచి లబ్ధి పొందేందుకు విపక్షాలు యత్నిస్తున్నాయన్న అంశం తేటతెల్లమవుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన అధికార పార్టీ అభ్యర్థులు, నాయకులు రైతుల నుంచి ఎలాంటి తరుగు తీసినా ఎన్నికల్లో నెగిటివ్ అవుతుందన్న అంశాన్ని గుర్తు చేస్తూ రైస్‌మిల్లర్ల సహకారం కోరుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా అధికార యంత్రాంగం నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా ఈ సారి వరి ధాన్యం తరుగు అంశం ఎన్నికల్లో రచ్చగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంగెంలో డెంగీ జ్వరాలు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. 20 రోజుల్లో సుమారు 15 మంది డెంగీతో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స కోసం వెళ్తున్నారు. రెండురోజుల క్రితం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు డెంగీతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. డెంగీ సోకిన వారిలో గీత కార్మిక కుటుంబాలే అధికంగా ఉన్నారని గ్రామస్తులు అంటున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి సాహితీ సామ్రాట్ రికార్డు పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు సరోజన

జగిత్యాల రూరల్: ఆర్యాని సకల కళావేదిక గౌతిమేశ్వర సాహితి కళా సేవాసంస్థ పెద్దపల్లి సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 15న గంట వ్యవధిలో ఆరు అంశాలపై కవితల పోటీ నిర్వహించారు. లక్ష్మీపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు మద్దెల సరోజన గంట వ్యవధిలో ఆరు కవిత్వాలు రాయగా.. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఆమెకు అంతర్జాతీయ స్థాయి సాహితి సామ్రాట్ రికార్డు పురస్కారం–2023ను అందుకున్నారు. అధ్యక్షుడు దూడపాక శ్రీధర్, సాహితీవేత్తలు ప్రభాకర్, రామారావు, మధుర, వేణుగోపాల్, సాహితి, నిర్వాహకులు రమాదేవి పాల్గొన్నారు.

లక్నోలో యువతి.. తీసుకొచ్చిన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన ఓ యువతి వారం రోజుల క్రితం అదృశ్యమవగా.. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. యువతి లక్నోలో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. రైలు లేదా బస్సులో వెళితే జాప్యమవుతుందని పోలీసులు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ విమానం ద్వారా పట్టణ పోలీసులను లక్నో పంపారు. పోలీసులు లక్నోలో ఉన్న యువతిని అదుపులో తీసుకొని ఆదివారం జగిత్యాలకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించగా.. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, పట్టణ సీఐ నటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టు షాపులపై దాడి

మల్లాపూర్: ఒగులాపూర్ గ్రామంలోని బెల్టు షాపులపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ తెలిపారు. రూ.33వేల విలువ గల 71 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌బీ కానిస్టేబుల్ రశీద్, కానిస్టేబుల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.70వేలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సారంగాపూర్: ఎన్నికల విధుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కోనాపూర్ గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. రూ.70వేలను ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పెంబట్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70వేలను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బోర్నపెల్లిలో..

రాయికల్: బోర్నపెల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి రూ.60,580 నగదును ఎలాంటి రశీదు లేకుండా తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నగదును జిల్లా గ్రీవెన్స్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

నగదు పట్టివేత


మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండిహనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు నగదు పట్టుకున్నారు. ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ కారులో రూ.58,500 నగదు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు.

ఉద్యమకారులకు హుజూరాబాద్ పట్టం



- 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు
- హుజూరాబాద్‌లోకి కమలాపూర్
- కమలాపూర్‌లో ముద్దసాని.. హుజూరాబాద్‌లో ఈటల మార్క్

హుజూరాబాద్: ఉద్యమాలకు కేంద్ర బిందువైన హుజూరాబాద్ 1957లో (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గంగా ఏర్పడి మూడేళ్లకే జనరల్ స్థానంగా మారింది. ఇందులో హుజూరాబాద్, భీమదేవరపల్లి తాలూకాలుగా ఉండేవి. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు ఉప ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగుసార్లు, టీడీపీ, స్వతంత్రులు మూడుసార్లు చొప్పున, ఇక బీఆర్‌ఎస్ ఏకంగా ఆరుసార్లు విజయం సాధించింది. 2021లో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది. ఇక్కడి నుంచి గెలిచిన ఇనుగాల పెద్దిరెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు మంత్రులుగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్ నియోజకవర్గకేంద్రంతోపాటు ఆ నియోజకవర్గంలో ఉన్న జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట(కొత్తగా ఏర్పడిన మండలం), హుజూరాబాద్ (మొత్తం ఐదు మండలాలు)తో కలిపి ముఖచిత్రంగా మారింది. ఇక కమలాపూర్ నియోజకవర్గం పూర్తిగా కనుమరుగైంది.



కేతిరి శాయిరెడ్డి



ఇనుగాల పెద్దిరెడ్డి



ఈటల రాజేందర్



కెప్టెన్ లక్ష్మీకాంతారావు



ముద్దసాని దామోదర్‌రెడ్డి



కేవీ.నారాయణరెడ్డి



పరిపాటి జనార్ధన్‌రెడ్డి

ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఇలా..

1957లో ఏర్పడిన హుజూరాబాద్‌కు ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఈ నియోజకవర్గంలో ఉన్న సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను హుస్నాబాద్ నియోజకవర్గంలో.. కమలాపూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు జమ్మికుంట, వీణవంక మండలాలను హుజూరాబాద్‌లో కలిపారు. అప్పటివరకు ఉన్న శంకరపట్నం, మానకొండూర్ మండలాలను విడదీసి కొత్తగా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గంలో కలిపారు. హుజూరాబాద్ నుంచి 1957లో ఇద్దరు స్వతంత్రులే బరిలో దిగగా.. పోలుసాని నర్సింగరావును గెలిపించారు. 1962లో గాడిపల్లి రాములు (కాంగ్రెస్), 1967లో తిరిగి పోలుసాని నరసింగరావు (కాంగ్రెస్), 1972లో వొడితెల రాజేశ్వరరావు (కాంగ్రెస్), 1978లో దుగ్గిరాల వెంకట్రావు (కాంగ్రెస్), 1983లో కొత్త రాజిరెడ్డి (స్వతంత్ర), 1985లో దుగ్గిరాల వెంకట్రావు (టీడీపీ), 1989లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కేతిరి సాయిరెడ్డి విజయం సాధించారు. ఇక 1994, 1999లో వరుసగా ఇనుగాల పెద్దిరెడ్డి (టీడీపీ) గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కెప్టెన్ లక్ష్మీకాంతరావును ఆదరించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతారావు టీఆర్‌ఎస్ నుంచి గెలిచారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి ఈటల రాజేందర్, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈటల ఘన విజయం సాధించారు. 2014, 2018లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ ఈటల రాజేందర్ టీఆర్‌ఎస్ నుంచే గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్ బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2004వరకు జమ్మికుంటలో నామినేషన్ వేసే ఇక్కడి అభ్యర్థులు.. 2009 నుంచి హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రంలోనే వేస్తున్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

నియోజకవర్గం వ్యవసాయ ఆధారితం. ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే కాకతీయకాలువ ద్వారా ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 59 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జమ్మికుంటలోని పత్తిమార్కెట్ ఉత్తర తెలంగాణలోనే అతి పెద్దదిగా పేరుగాంచింది. సీడ్ ఉత్పత్తిలోనూ హుజూరాబాద్ దేశంలోనే పేరుగాంచింది. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వ్యవసాయంలో సూచనలు చేస్తూ కొత్త వంగడాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. జమ్మికుంట, ఉప్పల్, బిజిగిర్‌షరీఫ్‌లో ఉన్న రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణికులకు రవాణా సులువవుతోంది.



మొత్తం ఓటర్లు 2,44,514

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 106 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు ఉండగా, మొత్తం 305 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 2,44,514 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 1,19,676 మంది పురుషులు, 1,24,833 మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

ఏడాది	గెలుపు	పార్టీ	ఓటమి	పార్టీ
1957	పి.నరసింగరావు	స్వతంత్ర	గాడిపెల్లి రాములు	స్వతంత్ర
1962	గాడిపెల్లి రాములు	కాంగ్రెస్	నాయిని దేవయ్య	సీపీఐ
1967	పి.నరసింగరావు	కాంగ్రెస్	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర
1972	వి.రాజేశ్వర్‌రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	స్వతంత్ర
1978	డి.వెంకట్రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	జనతా
1983	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	స్వతంత్ర
1985	డి.వెంకట్రావు	టీడీపీ	భాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్
1989	కేతిరి సాయిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	టీడీపీ
1994	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	బి.లక్ష్మీకాంతరావు	కాంగ్రెస్
1999	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	కేతిరి సాయిరెడ్డి	కాంగ్రెస్
2004	బి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ
2008	వి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్	కె.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2009	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	వీ.కృష్ణమోహన్‌రావు	కాంగ్రెస్
2010	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	ఎం.దామోదర్‌రెడ్డి	టీడీపీ
2014	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	కే.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2018	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	పాడి కౌశిక్‌రెడ్డి	కాంగ్రెస్
2021	ఈటల రాజేందర్	బీజేపీ	గెల్లు శ్రీనివాస్‌యాదవ్	టీఆర్‌ఎస్

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోగ శ్రావణి



ఇటిక్యాలలోని ఓ హోటల్‌లో పూరీలు కాలుస్తున్న బోగ శ్రావణి

రాయికల్: అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోగ శ్రావణి అన్నారు. ఆదివారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఓ హోటల్‌లో పూరీలు కాల్చారు. ప్రధాని ప్రవేశపెడుతున్న పథకాలతో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, సింగిల్‌విండో చైర్మన్ మహిపాతిరెడ్డి, మోర్చా మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రోట్టె శ్రీధర్, నాయకులు ఆకుల మహేష్, తీపిరెడ్డి రాజశేఖర్, లక్ష్మీనారయణ పాల్గొన్నారు.

ఎగిరేది కాషాయ జెండానే..

జగిత్యాలటౌన్: ఎవరెన్ని కుట్రలు చేసినా జగిత్యాల నియోజకవర్గంలో ఎగిరేది కాషాయ జెండానే అని బీజేపీ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డా.భోగ శ్రావణి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జగిత్యాల పట్టణం మోతె మాలవాడ అంబేద్కర్‌నగర్‌కు చెందిన 100మంది మహిళలు, యువకులు మ్యాదరి అశోక్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా.. భోగ శ్రావణి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరబత్తిని అనిల్‌కుమార్, ఆముద రాజు, దశరథరెడ్డి, సాంబారి కళావతి, నలువాల తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరించి ఓటు అభ్యర్థించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని కావేరి గార్డెన్‌లో బీఆర్‌ఎస్ కోరుట్ల మండల బూత్ స్థాయి సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, బీజేపీ ఎంపీ అరవింద్ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతీ బీఆర్‌ఎస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, మండల, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, అన్నం అనిల్, సర్పంచులు అంజయ్య, నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు పిడుగు సందయ్య, దుంపాల నర్సయ్య, గుగ్గిళ్ల సురేష్‌గౌడ్, సుదవేణి భూమయ్య, సింగిల్‌విండో చైర్మన్లు నర్సారెడ్డి, భూమయ్య, సాయిరెడ్డి, జగన్‌మోహన్ రావు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సుస్థిర పాలన

మల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం సాతారాంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా.సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరోజనాఆదిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొడ్డు రాజేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి, సర్పంచ్ బొడ్డు సుమలత పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

కోరుట్ల: రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని సంజయ్ అన్నారు. పట్టణంలోని ఏడో వార్డు అర్బన్ కాలనీలో 50 మంది మైనారిటీలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి సంజయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులవుతున్నారు



కండువా వేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి ప్రజలు బీఆర్‌ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు తోట మధు ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 20 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాయకులు పడిగెల గంగారెడ్డి, గొల్లపల్లి చందు, లింగన్న, జగన్ పాల్గొన్నారు.

3 లక్షల మంది నా కుటుంబ సభ్యులే..

జగిత్యాల: జగిత్యాలలోని మూడు లక్షల మంది నా కుటుంబ సభ్యులేనని, వారికి ఏ ఆపద వచ్చినా ముందుండి ఆదుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఇంటింటి ప్రచారంలో భాగంగా 23, 37 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. 22వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతోమంది అమరులైన వారి ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో బీఆర్‌ఎస్, టీడీపీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆత్మ బలిదానాలతో తెలంగాణ సాధించుకుంటే బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదన్నారు. యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగులు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం మల్లేషం, శ్రీరాముల గంగాధర్, విజయ్, దూడ గంగాధర్, శివ పాల్గొన్నారు.



కండువా వేస్తున్న జీవన్‌రెడ్డి



మొన్న బీఆర్‌ఎస్‌లోకి..



నిన్న కాంగ్రెస్ గూటికి

రాయికల్: కాంగ్రెస్ రాయికల్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, కౌన్సిలర్ అనురాధ దంపతులు తిరిగి సొంతగూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన దంపతులు ఈనెల 17న ఎమ్మెల్సీ కవిత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు కొందరు తమను నమ్మించి పార్టీ కండువా కప్పారని, తమ కుటుంబం కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తుందని, జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని చేస్తామని తెలిపారు. వారివెంట నాయకులు బాపురపు నర్సయ్య, వాసం దిలీప్, షాకీర్, రాజేశం, దివాకర్, నాగరాజు ఉన్నారు.

గెలిపించండి.. సకల సౌకర్యాలు కల్పిస్తా



ధర్మపురిలో అడ్లూరి ప్రచారం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని, సకల సౌకర్యాలు కల్పిస్తానని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి, దోనూర్‌లో ఆదివారం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ధర్మపురిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గతంలో మాజీ మంత్రి రత్నాకర్ చేసిన అభివృద్ధి పనులే నేటికి కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేష్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేష్, సీపతి సత్యనారాయణ, అశెట్టి శ్రీనివాస్, కౌన్సిలర్లు నాగలక్ష్మి, సంతోషి, అరుణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బుగ్గారం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో యశ్వంతరావుపేట, శెకెల్ల, గోపులాపూర్, గంగాపూర్, బుగ్గారం, వెల్గొండ గ్రామాల నుంచి సుమారు 200 మందికి పైగా యువకులు, స్థానిక నాయకులు డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అడ్లూరి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పెద్దఎత్తున యువకులు, స్థానిక నాయకులు రావడం కొత్త ఉత్సాహానిస్తోందన్నారు. గత ఎన్నికల్లో తాను గెలిచినా.. అధికారుల తప్పిదాలతో ఓడిపోయానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎంసీసీ అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు సర్సాగౌడ్, తాడెపు లింగన్న, జంగ శ్రీనివాస్, కండ్లె మదన్‌మోహన్, బీర్పూర్ తిరుపతి, వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

జగిత్యాలక్రైమ్: తిప్పన్నపేట గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం కారు అతివేగంగా వచ్చి అదుపుతప్పి ద్విచక్ర వాహనం, తరువాత చెట్టును ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మేసు రమేశ్, సందీప్ కారులో బుగ్గారం నుంచి జగిత్యాల వస్తున్న క్రమంలో జగిత్యాలకు చెందిన సాయిరెడ్డి, నరేష్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో కారులో ఉన్న రమేశ్, సందీప్, ద్విచక్ర వాహనంపై ఉన్న సాయిరెడ్డి, నరేష్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.